కండక్టర్ కోటేశ్వరమ్మకు సీఎం అభినందనలు


కండక్టర్ కోటేశ్వరమ్మను సన్మానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తనందుకు టీఎస్‌ఆర్టీసీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ట్యాంక్‌బండ్ వద్ద శుక్రవారం వంద కొత్త బస్సులను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌లతో కలిసి సీఎం ప్రారంభించారు. అనంతరం ఆర్టీసీలో అత్యధిక ఆదాయం సమకూర్చిన ఆర్టీసీ సిబ్బందిని సీఎం అభినందించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపోకు చెందిన కోటేశ్వరమ్మకు సీఎం, డిప్యూటీ సీఎం బెస్ట్ ఈపీకే (ఎర్నింగ్ పర్ కిలోమీటర్) అవార్డు అందజేశారు. తమ డిపోకు చెందిన కోటేశ్వరమ్మ కిలో మీటరుకు రూ.93 ఆదాయం సమకూర్చడం గర్వకారణమని డిపో మేనేజర్ మురళీధర్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. కోటేశ్వరమ్మను ఆదర్శంగా తీసుకొని సంస్థను లాభాల బాటలో నడిపించాలని డీఎం కార్మికులకు విజ్ఞప్తి చేశారు.

కండక్టర్‌ను చెప్పుతో కొట్టిన మహిళ

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తాను అడిగిన చోట ఆర్టీసీ బస్సు ఆపలేదని ఆగ్రహించిన ఓ మహిళ కండక్టర్‌పై చెప్పుతో కొట్టింది. ఈ సంఘటన శివరాంపల్లి వద్ద శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. శివరాంపల్లికి చెందిన ప్రసన్న(35) శనివారం మెహిదీపట్నంకు చెందిన 300 నంబర్ బస్సును తాను నిలబడిన చోట ఆపమని చేయి చూపి అడిగింది. కానీ, డ్రైవర్ బస్సు ఆపలేదు. బస్టాప్‌లోకి వెళ్లి బస్సు ఆపారు. దీంతో ఆగ్రహించిన ప్రసన్న బస్టాప్‌లోకి వచ్చి బసుస ఎక్కి కండక్టర్ నర్సింహతో గొడవపడింది. చెప్పు తీసుకుని కొట్టింది. ఈ ఘటనపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి దర్యాప్తు చేస్తున్నారు.


సదస్సులో ప్రొ.డి.నరసింహారెడ్డి, నిపుణులు

దేశంలోని వ్యవసాయ రంగంలో తీవ్ర సంక్షోభం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని న్యూ ఢిల్లీ మానవ అభివృద్ధి సంస్థ అధ్యాపకులు ప్రొ.డి.నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, ఆర్థిక శాస్త్ర విభాగం, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఐసీఎస్ఎస్ఆర్- దక్షిణ భారత దేశ ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు- మూల్యాంకనం" అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును వర్సిటీలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే దేశంలో 80 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడుతున్నారని, రెండు దశాబ్దాల క్రితం దేశ జీడీపీ వృద్ధిలో వ్యవసాయరంగం ఉత్పత్తులు 52 శాతం ఉండగా ప్రస్తుతం 18శాతానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ముంబై ఇందిరాగాంధీ అభివృద్ధి పరిశోధన సంస్థ మాజీ డైరెక్టర్, ఉప కులపతి ప్రొ.ఎస్.మహేంద్రదేవ్ మాట్లాడుతూ "భారతదేశం 100 అవకాశాలు- సమస్యలు- ఆర్థికాభివృద్ధికి సూచనలు" అనే అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థికాభివృద్ధికి చేసిన సూచనలు, సేవలకు గాను ప్రఖ్యాత ఆర్థిక వేత్త, కేంద్ర ప్రణాళికాసంఘం మాజీ సభ్యులు ప్రొఫెసర్ సి.హెచ్.హనుమంతరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయ సామాజిక శాస్త్రాల విభాగ మాజీ డీన్ ప్రొ.టి.జ్యోతి రాణి ప్రొ.జయశంకర్, తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొ.కె.ముత్యం రెడ్డి, కార్యదర్శి డా.బి.వెంకటేశ్వరరావు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఆర్థికశాస్త్రం విభాగం అధిపతి డా.కె.కృష్ణా రెడ్డి, విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ జి.పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ ప్రొ.రేవ, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పెరుగుతున్న సౌరశక్తి వినియోగం


సోలార్ మీట్‌ను ప్రారంభించిన టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సౌరశక్తి వినియోగం పెరుగుతుందని, సోలార్ విద్యుత్‌తో గృహ వినియోగదారులకు అనేక లాభాలున్నాయని టీఎస్ రెడ్కో ఎండీ జానయ్య అన్నారు. గ్రీన్‌టెక్ ఇండియా, అదానీ సోలార్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లో పార్టనర్స్ మీట్-2024ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జానయ్య మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు ఇస్తున్నాయన్నారు. అదానీ సోలార్ మార్కెటింగ్ హెడ్ సెసిల్ అగస్టీన్ మాట్లాడుతూ తొలిసారి 570 వాట్ల సోలార్ ప్యానెల్‌ను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ టెక్ ఇండియా వ్యవస్థాపకుడు సత్య కిరణ్ గన్నారపు, అదానీ సోలార్ సంస్థ ప్రతినిధి ప్రశాంత్, తెలంగాణ రాష్ట్రంలోని పలువురు సోలార్ డీలర్లు పాల్గొన్నారు.

'ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.శంకర్ ఆరోపించారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో యూనియన్ బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాయింట్ రీజినల్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ఏఐయూబీఈఏ కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సును ప్రారంభించిన అనంతరం శంకర్ మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి కేంద్రప్రభుత్వం బ్యాంకుల విలీనం చేపట్టిందన్నారు. ప్రభుత్వరంగసంస్థల ప్రైవేటీకరణ వల్ల కార్మికులు ఉద్యోగభద్రత కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సదస్సులో యూనియన్ బ్యాంకు హైదరాబాద్ జోన్ చీఫ్ జనరల్‌మేనేజర్ కె.భాస్కర్‌రావు, జనరల్ మేనేజర్ కృష్ణన్, యూనియన్‌బ్యాంకు అవార్డు ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు రెవెన్యూ అధికారుల బదిలీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులను ప్రభుత్వం శనివారం బదిలీ చేసింది. సికింద్రాబాద్ ఆర్డీఓ కారాల్యయంలో డీఏఓగా పనిచేస్తున్న అన్వర్ హుస్సేన్‌ను నల్లగొండ జిల్లాకు బదిలీ చేశారు. అలాగే అంబర్‌పేట్ తహసీల్దార్ భిక్షపతిని, కలెక్టరేట్‌లోని అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ)లో స్పెషల్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నర్సయ్యను సంగారెడ్డి జిల్లాకు ట్రాన్స్‌ఫర్ చేశారు.

పోలీసులపై దుర్భాషలాడుతూ పోస్టు

- నిందితుడిపై క్రిమినల్ కేసులు నమోదు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసులు వేసిన చలానా తప్పుగా ఉందని పోలీసులను దుర్భాషలాడుతూ రిపోర్ట్ యాజ్ యాప్‌లో పోస్టు పెట్టిన యువకుడిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. చాంద్రాయణగుట్టకు చెందిన ముస్తఫాఅహ్మద్ ట్రాఫిక్ ఈ చలానాల ఫిర్యాదు కోసం నిర్వహించే రిపోర్ట్ యాజ్ యాప్‌లో తన హీరో గ్లామర్ వాహనా.. నికి చెందిన ఓ చలానాను అప్‌లోడ్ చేశాడు. అనంతరం ఇది తప్పుడు చలానా పోలీసులు కళ్లు మూసుకొని పనిచేస్తున్నారా అంటూ ప్రశ్నించాడు. హిందీలో దుర్భాషలాడుతూ పోస్టు పెట్టాడు. యాప్ నిర్వహిస్తున్న సిబ్బంది చలానా అసలైన వాహనానికే వేసినట్టు నిర్ధారించారు. విధుల్లో ఉన్న పోలీసులను తప్పుదారి పట్టించే విధంగా వ్యవహరించడంతో పాటు దుర్భాషలాడినందుకు ట్రాఫిక్ ఈ-చలాన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు ముస్తఫా అహ్మద్‌పై 504, 506, 509, 186, 189 ఐపీసీతో పాటు ఐటీ సెక్షన్ 67 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కస్టమర్ల చూపు.. క్వాలిటీ వైపు!


సదస్సులో మాట్లాడుతున్న వీసీ నర్సింహారెడ్డి, వేదికపై డైరెక్టర్ శ్రీదేవి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా వ్యాపార రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, నాణ్యమైన వస్తువులనే వినియోగదారులు కోరుకుంటున్నారని జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం జె హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంక్యుబేటర్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. వినియోగదారుడు సంతృప్తి చెందిన వస్తువుకు మార్కెట్‌లో డిమాండ్ దానంతటదే వస్తుందన్నారు. అలీప్ సంస్థ జూట్ బ్యాగుల తయారీలో మహిళలకు శిక్షణ ఇవ్వడంవల్ల ఎంతోమంది వ్యాపార రంగాల్లో నిలదొక్కుకున్నారని చెప్పారు. కొత్తగా వ్యవసాయ రంగంలోనూ ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందుకు అలీప్ ఏర్పాట్లు చేయడం అభినందనీయమని అన్నారు. ప్రగతి నగర్‌లోని అలీప్ సంస్థను అనేక దేశాలకు చెందిన ప్రముఖ వ్యాపార దిగ్గజాలు విజిట్ చేశారని, అక్కడ ఉత్పత్తి అవుతున్న వస్తువులు నాణ్యమైనవి కనుకనే పలు దేశాల్లో కస్టమర్లు వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. వ్యాపార శిక్షణ పొందేందుకు యువత ముందుకు రావాలని, మరింత మందికి ఉపాధి కల్పించాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కొత్త ఆలోచనలతో వ్యాపారరంగాన్ని ఎంచుకున్న వారికీ ఉపాధి దొరకడమే కాకుండా వారి సంస్థ ద్వారా అనేక మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వీలవుతుందన్నారు. హైదరాబాద్‌లో స్ట్రీట్ ఫుడ్ సెంటర్లకు ఉన్న గిరాకీ.. స్టార్ హోటళ్లకు కూడా లేదన్నారు. జె హబ్ డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం ఇలాంటి సదస్సు మేలు చేకూరుస్తాయన్నారు. వ్యాపారంలో లోపాలను ఎదుర్కొని ఎలా ముందుకు సాగాలో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసరు జహురుల్లా, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ఫుడ్‌బాక్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ చారుధ్యాని, అలీప్, వీ హబ్, నీతి అయోగ్, జేఎన్‌టీయూ విద్యార్థులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై హర్షం

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రజలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా బడ్జెట్ ఉందంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌తో పేదలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరేలా ఉందన్నారు. ఆరు గ్యారెంటీల కోసం రూ. 53వేల కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. నగరాభివృద్ధి, విద్య, వైద్య, గృహ నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం వంటి అనేక రంగాలకు అవసరమైన నిధులు కేటాయించిందన్నారు.

ఆరు గ్యారెంటీలకు ప్రాధాన్యం కల్పించారు



కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే దిశగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు ఉంది. ఆరు గ్యారెంటీలకు ప్రాధాన్యం కల్పిస్తూ రూ. 53వేల కోట్లకు పైగా నిధులు కేటాయించడం మంచి పరిణామం. నగరాభివృద్ధి, రైతుల రుణ మాఫీపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తే బాగుంటుంది.

- ఉప్పాల మధుసూదన్‌రావు, సప్తగిరికాలనీ

వైద్యరంగానికి ప్రాధాన్యం



రాష్ట్రంలోని పేదలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో లేవు. వైద్య రంగాన్ని బలోపేతం చేసేలా చర్యలు తీసుకోవడం శుభ పరిణామం. వైద్య రంగానికి రూ.11వేల కోట్లు కేటాయించడం హర్షించదగ్గ విషయం. పేదలకు ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డుల జారీపై దృష్టి సారించి.. సకాలంలో పేదలకు వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం కృషి చేయాలి. బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేయాలి.

- పీవీ రమణరావు, వివేకానందనగర్‌కాలనీ

బడ్జెట్ తెలంగాణ పునర్నిర్మాణానికి బాటలు



అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తెలంగాణ పునర్నిర్మాణానికి బాటలు వేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని గత పదేళ్లలో అప్పుల రాష్ట్రంగా బీఆర్ఎస్ పార్టీ మార్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టేందుకు ఈ బడ్జెట్ దోహదపడనుంది. ఆరు గ్యారెంటీల అమలుకు రూ. 53వేల కోట్ల కేటాయింపు హర్షణీయం. బడ్జెట్‌తో కాంగ్రెస్ మార్కు పాలన సుస్పష్టం అవుతోంది.

- బండి రమేష్, కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి

సెమీస్‌లో చంద్రశేఖర్ జోడి

- హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్


సెమీస్‌లో గెలుపొందిన చంద్రశేఖర్ జోడి

హైదరాబాద్ క్రీడా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): 16వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఐపీఎస్ చంద్రశేఖర్‌రెడ్డి, లగడపాటి శ్రీధర్ జోడి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. మెన్స్ 50 ప్లస్ డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో చంద్రశేఖర్ రెడ్డి, శ్రీధర్‌లు 8 - 5 స్కోరుతో కృష్ణారెడ్డి, ఆదిశేషలపై విజయం సాధించారు. 50 ప్లస్ సింగిల్స్ విభాగం క్వార్టర్‌ఫైనల్లో సీవీ ఆనంద్ 8-2 స్కోరుతో చంద్రశేఖర్‌పై అలవోక విజయం సాధించారు. పురుషుల డబుల్స్ 50 ప్లస్ విభాగం క్వార్టర్ ఫైనల్లో వహీద్, నంద్యాల జోడి 8-4 స్కోరుతో శ్రీనివాస్, ప్రసన్నలపై విజయం సాధించారు. 40 ప్లస్ డబుల్స్ విభాగంలో విజయ్‌వర్మ, వెంకటసాయిలు 8-2 స్కోరుతో సతీశ్, ముతులపై అలవోక విజయం సాధించారు. పురుషుల 30 ప్లస్ సింగిల్స్‌లో సూర్య పవన్ 8-3తో ఈశ్వర్‌పై, అంకేశ్ 8-6తో సురేశ్ రెడ్డిపై పైచేయి సాధించి సెమీస్‌కు చేరారు. 40 ప్లస్ సింగిల్స్‌లో బోస్ కిరణ్ 8-3 తో సురేశ్ ముతుపై గెలుపొందగా, రాజ 8-1 తో శ్రీనివాస కుమార్‌ను ఓడించాడు. 60 ప్లస్ సింగిల్స్‌లో వెంకటేశ్‌పై 8-3తో రామ్‌రెడ్డి, సోమశేఖర్‌పై 8-3తో మధుకర్ గెలుపొందారు. ఏఆర్‌రావు, గజపతిలు 70 ప్లస్ సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో విజయాలు నమోదు చేశారు. 70 ప్లస్ డబుల్స్‌లో సాయి రాంబాబు, మదన్ మోహన్ జోడి, మధుసూదన్, రవిమోహన్ జోడి సైతం సెమీస్‌కు అర్హత సాధించాయి.

నేడు గచ్చిబౌలి స్టేడియంలో 5కే, 10కే, 21కే రన్

గచ్చిబౌలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సేవాభారతి ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలి బాలయోగి స్టేడియం రన్‌ఫర్ గర్ల్‌చైల్డ్- 2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 5.30కు గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ హాజరవుతారని తెలిపారు. 5కే, 10కే, 21కే రన ఉంటుందని తెలిపారు.

బొటానికల్ గార్డెన్ అభివృద్ధికి కృషి

- సీఎం ముఖ్యకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

గచ్చిబౌలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని బొటానికల్ గార్డెన్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తామని బొటానికల్ గార్డెన్ మాజీ డైరెక్టర్, ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం బొటానికల్ గార్డెన్‌లో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. బొటానికల్ గార్డెన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్లు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి


విద్యార్థులతో జస్టిస్ రజని

మియాపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని జస్టిస్ టి.రజని అన్నారు. ఆదివారం ఆమె మియాపూర్ గోకుల్ ప్లాట్స్‌లోని డ్రీమ్ ఫర్ గుడ్ సొసైటీ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేరాల నుంచి సమాజాన్ని విముక్తిచేయడానికి, ఉన్నత స్థాయికి ఎదిగేందుకు విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే ఆస్తి మంచి విద్య అని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో సమావేశం

జీహెచ్ఎంసీ పరిధిలోని పార్టీ కార్పొరేటర్లతో తెలంగాణ భవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హమీద్‌పటేల్, వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, రోజాదేవి, మంజుల, సింధు పాల్గొన్నారు.

- మియాపూర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి)

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో క్వీర్ కార్నివాల్


కార్యక్రమంలో ప్రముఖ సినీనటి, బ్లూక్రాస్ సంస్థ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని

రాయదుర్గం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఎల్జీబీటీక్యూఐఏ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్స్, క్వీర్, ఇంటర్‌సెక్స్, అసెక్సువల్) కమ్యూనిటీ ఆధ్వర్యంలో క్వీర్ కార్నివాల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి, బ్లూక్రాస్ సంస్థ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని, రచయిత, దర్శకుడు సాంటో మోహన్ వీరాంకి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ సమస్యలపై రాసిన పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. సొసైటీ ట్రాన్స్‌జెండర్స్‌ను చిన్నచూపు చూస్తోందని, అందరితో సమానంగా చూసే దృక్పథాన్ని ప్రజలు అలవర్చుకోవాలని అమల సూచించారు. ట్రాన్స్‌జెండర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, డాక్టర్లు, ఇంజనీర్లు కూడా ఉన్నారని, వారిని మరింత ప్రోత్సహించాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన నృత్యప్రదర్శన, ఫ్యాషన్‌షో ఆకట్టుకున్నాయి.

సూరారంలో కట్టమైసమ్మ బోనాల జాతర


కట్టమైసమ్మ గుడి ఎదుట ఏర్పాటుచేసిన అమ్మవారి ప్రతిమలు

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సూరారం కట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మ బోనాల జాతర శనివారం ప్రారంభమైంది. ఆదివారం అమ్మవార్ల ప్రధాన జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర మొదటి రోజు ఉదయం 5గంటలకు సుప్రభాత సేవతో పూజలు మొదలయ్యాయి. జాతరకు బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హోటళ్లలో అరిటాకులను వినియోగించాలి


శాలువాతో రాధికను సత్కరిస్తున్న కోల రవీంద్ర ముదిరాజ్

షాపూర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) ఆధ్వర్యంలో ప్లాస్టిక్‌ను నిషేధించి అరిటాకులను ఉపయోగిస్తున్న హోటల్ యజమానురాలు రాధికను సన్మానించారు. సూరారం చౌరస్తా మస్తాన్ బిల్డర్స్ వెంకట్రామ్‌నగర్, బచుపన్ పాఠశాల ఎదురుగా రాధిక ప్లాస్టిక్ ప్లేట్లను వాడకుండా అరిటాకుల్లో భోజనం వడ్డిస్తున్నారు. హోటళ్లలో పర్యావరణాన్ని కాపాడే విధంగా నడిపిస్తానని ఆమె చెప్పింది. ఇది తెలుసుకున్న పర్యావరణ ప్రేమికుడు భారత్ వికాస్ పరిషత్ అబ్దుల్ కలామ్ బ్రాంచ్ కార్యదర్శి కోల రవీంద్రముదిరాజ్ రాధికను శాలువాతో సత్కరించారు. భోజన ప్రియులు ఇలాంటి హోటళ్లలో భోజనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మొబైల్ వేణు, సంతోష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

దుండిగల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): చర్చి గాగిల్లాపూర్‌లోని 28వ వార్డులో రూ. 45 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ జోస్పిన్ సుధాకర్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ నేత కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో 27వ వార్డు కౌన్సిలర్ శంకర్‌నాయక్, సీనియర్ నాయకుడు సుధాకర్‌రెడ్డి, 27వ వార్డు ప్రెసిడెంట్ శివయాదవ్, మున్సిపల్ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్‌లో గ్రేట్ బాంబే సర్కస్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చింతల్‌లోని మున్సిపల్ మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రేట్ బాంబే సర్కస్‌ను మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. 80 మంది దేశీయ, విదేశీ కళాకారులతో పాటు స్టంట్స్ జోకర్లతో వినూత్న హాస్య ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్లు ఉన్ని కృష్ణ, వెంకట్‌రెడ్డి, ఇలియాజ్ ఖాన్, కళాకారులు పాల్గొన్నారు.

'శ్మశాన వాటికను పరిరక్షించండి'

గచ్చిబౌలి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గోపన్‌పల్లి గ్రామ సర్వేనెంబర్ 21లోని దూబేక కుటుంబానికి సంబంధించిన శ్మశాన వాటికను పరిరక్షించాలని రాంరతన్ సేవా సమితి సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం వారు శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. 100 సంవత్సరాల నుంచి సర్వేనెంబర్ 21లో ఐదు ఎకరాలలో ఉన్న శ్మశాన వాటికను ఈ మధ్య తమ కుటుంబ సభ్యులకు చెందిన శ్మశాన వాటికను ఇతరులు కూడా ఉపయోగించుకుంటున్నారని వివరించారు. శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించి సదుపాయాలు కల్పించాలని సేవా సమితి సభ్యులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

బిర్యానీలో వెంట్రుక

- ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు
- హోటల్‌పై ఎస్‌టీసీ కేసు


హోటల్ మేనేజర్ ఆదిత్యకు నోటీసును అందజేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నిహారిక

బాలానగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తన స్నేహితులతో కలిసి హోటల్‌లో బిర్యానీ తింటుండగా వెంట్రుక రావడంతో పాటు బిర్యానీ కూడా రుచిగా లేదని వారు ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నిహారిక అక్కడికి చేరుకొని హోటల్‌లోని కిచెన్‌ను, టాయిలెట్స్‌ను తనిఖీ చేశారు. కస్టమర్ ఫిర్యాదు మేరకు హోటల్‌పై సమ్మరీ ట్రైయల్ (ఎస్‌టీసీ) కేసు నమోదు చేసి, హోటల్ మేనేజర్ ఆదిత్యకు నోటీసులు ఇచ్చారు. పది రోజుల్లో మరోసారి హోటల్‌ను సందర్శించి తనిఖీ చేస్తామని, హోటల్ నిర్వహణ తీరులో మార్పు రాకుంటే, కస్టమర్లకు అందించే ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్య

దుండిగల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇంటో ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. బిహార్‌కు చెందిన దేవేష్‌కుమార్(22) కుటుంబ సభ్యులతో కలిసి బతుకుదెరువుకోసం వచ్చి దుండిగల్ 12వ వార్డులో ఉంటూ, కూలి పనులు చేస్తున్నాడు. ఇంట్లో వారు రోజు మాదిరిగా పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి గది తలుపులు పెట్టి ఉన్నాయి. ఎంత పిలిచినా దేవేష్‌కుమార్ పలక పోవడంతో కిటికీలో నుంచి చూడగా గదిలోని రాడ్‌కు టవల్‌తో ఉరి వేసుకొని కనిపించాడు. కుటుంబ సభ్యులు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని కిందకు దించిచూడగా మృతుడి జేబులో పియాంక్ తనను ప్రేమ పేరుతో మోసం చేశారని, అందుకే ఆత్మ చేసుకుంటున్నా నని రాసిన లేఖ దొరికింది. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి మృతి

దుండిగల్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ర్యాట్‌కిలర్ తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా, ఆందోల్ మండల్, తాలేం గ్రామానికి చెందిన నామ నిఖిల్‌కుమార్(20) బహదూర్‌పల్లి గ్రీన్‌హిల్స్ కాలనీలో ఉంటున్న అక్క, బావ దగ్గరకు వచ్చాడు. శుక్రవారం నిఖిల్‌కుమార్ కడుపునొప్పి అని చెప్పి ర్యాట్‌కిలర్ తాగడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు బైకు దొంగల అరెస్టు

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు, రహదారుల పక్కన పార్కింగ్ చేసి ఉన్న ఆటోలు, ద్విచక్రవాహనాలను దొంగిలించే ఇద్దరు పాత నేరస్థులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఇంద్రసేనా రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లమ్మబండలో నివాసముండే కొంపల్లి ప్రసాద్, బెల్లంపల్లి గిరిబాబు దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లొచ్చారు. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు, ఓ ఆటో, చందానగర్ పరిధిలో ఓ బైక్ దొంగిలించారు. ఈనెల 8న కూకట్‌పల్లి పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా... వీరిద్దరు బైకు వెళ్తుండగా పోలీసులు వారిని విచారించగా, దొంగతనాల భాగోతం బయటపడింది. నిందితుల నుంచి 3 బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు.

ఔషధాల తయారీ ముడిసరుకు స్వాధీనం

హైదర్‌నగర్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ బిల్లులు లేకుండా ఔషధాల తయారీకి ఉపయోగించే ముడిసరుకులు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కేపీహెచ్‌బీ పోలీసులు కూకట్‌పల్లి కమర్షియల్ టాక్స్ అధికారికి ఫిర్యాదు చేశారు. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం సాయంత్రం కేపీహెచ్‌బీ ఎస్సై సత్యకుమార్ విధులు నిర్వహిస్తున్న సమయంలో కేపీహెచ్‌బీ ఫేజ్-3 టెంపుల్ బస్టాప్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఔషధాల తయారీ ముడిసురుకు విక్రయిస్తున్నారని సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించి వారి పేర్లు శ్రీధర్‌రెడ్డి (50), కొండేటి భరత్(30)లుగా గుర్తించారు. వారి నుంచి ఔషధాల తయారీకి ఉపయోగించే ముడి సరుకు సెటాగ్లిప్టన్ 170కిలోలు, టెల్మిసర్టాన్ 25కిలోలు, నార్ ఫ్లాక్సిన్ 3కిలోలు, లీసార్టన్ పోటాషియం 3కేజీలు స్వాధీనం చేసుకున్నారు. ముడి సరుకు సంబంధించిన బిల్లులు చూపించమని ప్రశ్నించగా జీఎస్టీ టాక్స్ తప్పించేందుకు జీఎస్టీ బిల్లులు లేవని తెలిపారు. వారి సరుకు స్వాధీనం చేసుకున్న పోలీసులు కూకట్‌పల్లి కమర్షియల్ టాక్స్ అధికారి దృష్టికి తీసుకొని వెళ్లినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపారు.

పేద వధువులకు అండగా ఉప్పల ఫౌండేషన్

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుపేద వధువులకు ఉప్పల ఫౌండేషన్ అండగా ఉంటోందని ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీకి చెందిన పేద వధువు ప్రసన్నలక్ష్మి, గౌలిపురాకు చెందిన నవనీత అనే వధువుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో పుస్తె, మెట్టెలు, చీర, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా నవ వధువుల కుటుంబ సభ్యులు ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న దుకాణాలపై పోలీసుల దాడి

నిజాంపేట్, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న దుకాణాలపై బాచుపల్లి పోలీసులు దాడి చేసి వారి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసు కున్నారు. రూ.20వేల విలువ చేసే బీర్‌బాటిళ్లు, వివిధ బ్రాండ్‌ల విస్కీ, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేశారు. ఎవరైనా అనుమతి లేకుండా మద్యం అమ్మితే తమకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి పేరును గోప్యంగా ఉంచుతామని సీఐ ఉపేందర్ పేర్కొన్నారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డినగర్ డివిజన్‌లోని గాంధీనగర్ కమ్యూనిటీ హాల్‌లో చేపట్టిన గృహలక్ష్మి దరఖాస్తులను డివిజనల్ ఇంజనీర్ భిక్షపతి, ఏఈ నాగేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ ప్రక్రియ 15వ తేదీ వరకు ఉంటుందని ఇన్‌చార్జి ఏడీ కేవల్‌కుమార్, ఏఈ శంకర్‌నాయక్ తెలిపారు. ఆదివారం కూడా కౌంటర్ తీసి ఉంటుందని, దరఖాస్తు దారులు, గ్యాస్ నెంబరు, రేషన్‌కార్డు నెంబర్లు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ రవి, రాజు, పూజా పాల్గొన్నారు.